ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శనివారం 27 జనవరి 2024





సిద్ధిపేటలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సిద్ధిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



ఆరు గ్యారంటీలు చేరువయ్యేలా..



స్వాతంత్ర సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

- 'ప్రజాపాలన'తో శ్రీకారం చుట్టిన సీఎం
- 75వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- స్వాతంత్ర సమరయోధులకు సన్మానం
- జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసుల గౌరవ వందనం స్వీకరణ
- జిల్లా అభివృద్ధిపై సమగ్ర సందేశం
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సిద్ధిపేటటౌన్, జనవరి 26: ప్రజాపాలన ద్వారా ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా పాలన అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. శుక్రవారం సిద్ధిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలనుదేశించి ప్రసంగించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందో వివరించారు. డిసెంబరు 9 నుంచి నేటి వరకు జిల్లాకు చెందిన మహిళలు దాదాపు 33 లక్షల మంది ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. రూ.10 లక్షల వరకు పెంచిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో వచ్చిన 3 లక్షలకు పైగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వివరించారు. సిద్ధిపేట జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అందరూ ప్రతిన బూనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ బాలికల హైస్కూల్ సిద్ధిపేట, రాఘవపూర్ కేజీబీవీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, సిద్ధిపేట సీపీ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్‌లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థులు జిల్లా ప్రజలు పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు



జిల్లా కలెక్టరేట్‌లో

సిద్ధిపేటఅగ్రికల్చర్/సిద్ధిపేట క్రైం, జనవరి 26: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో రెహమాన్, కలెక్టరేట్ సిబ్బంది, పలు శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భరతమాత, రుద్రమదేవి వేషధారణలో విద్యార్థులు

జడ్పీ కార్యాలయంలో

జిల్లాపరిషత్ కార్యాలయ ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈ వో, డీఆర్డీఏ పీడీ, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో

సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే సిద్ధిపేట పట్టణం పెద్దకోడూరు గ్రామశివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అడిషనల్ డీసీపీ రామచంద్రారావు జాతీయ జెండాను ఎగురవేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సిద్ధిపేట కమిషనరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్



సిద్ధిపేట జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



సిద్ధిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న సిద్ధిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

మంత్రి గారూ.. మీరు రారు..!

సర్పంచ్‌లను ప్రారంభించుకోనివ్వరా?

- 'నేను లేనిదే ఏ కార్యక్రమం జరకూడదనడం' రాజ్యాంగ విరుద్ధం
- ఈనెల 30 లోగా సమయం ఇవ్వకపోతే జీపీ భవనాలను సర్పంచ్‌లే ప్రారంభిస్తారు
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ఏ కార్యక్రమం చేయకుండా అడ్డగిస్తే సహించేది లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఘాటు విమర్శలు

హుస్నాబాద్, జనవరి 26: "సర్పంచులు నిర్మించిన గ్రామపంచాయతీ భవనాల ప్రారంభోత్సవాలకు మీరు రారు.. వారిని ప్రారంభించుకోకుండా ఆదేశాలు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని" రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్‌పై మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఘాటు విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ఈనెలాఖరుతో పూర్తవుతందని, శిలాఫలకాల్లో తమ పేరు ఉండాలనే కోరికతో ప్రారంభించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే "నేను లేనిదే ప్రారంభించొద్దని మంత్రి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సబబు కాదన్నారు. ఈనెల 30లోపు ప్రారంభించుకోవడానికి సానుకూలంగా ఉండాలని, లేనట్లయితే తమ బీఆర్ఎస్ సర్పంచులు, వార్డు మెంబర్లు కలిసి ప్రారంభించుకుంటారని ఇందులో ఏ మాత్రం వెనుకడుగు వేయబోమని వెల్లడించారు. పొన్నం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారే తప్ప కరీంనగర్, సిద్ధిపేట, హన్మకొండ జిల్లాల ఇన్‌చార్జి మంత్రిగా లేరన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేనే ముఖ్యుడని రాజ్యాంగ పరంగా ఆయనకు హక్కులు కల్పించారని, ఇందులో మీ ప్రమేయాన్ని ఎందుకు కోరుకుంటున్నారని, దీనికి వివరణ ఇవ్వాలని సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఏ కార్యక్రమం చేయకుండా ప్రతి దానిని అడ్డగిస్తున్నారని, దీన్ని తాము సహించబోమని హెచ్చరించారు. మంత్రిగా గౌరవిస్తాం.. దాన్ని మీరు కాపాడుకోవాలని సూచించారు. జీపీ భవనాల ప్రారంభోత్సవాలకు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, మున్సిపల్ మాజీ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య, నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, ఎండి అన్వర్, ఆకుల వెంకట్, తిరుపతిరెడ్డి, బీలునాయక్, పలువురు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఉత్తమ ఫలితాలే మీరిచ్చే రిటర్న్ గిఫ్ట్

- కార్పొరేట్లను తలదన్నేలా సిద్దిపేట బాలికల పాఠశాల అభివృద్ధి
- స్కూల్‌లో స్పెషల్ స్టడీ, ఇంట్లో డిజిటల్ స్టడీ
- అందరికీ డిజిటల్ కంటెంట్ బుక్కులను అందజేస్తా
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్ధిపేట టౌన్, జనవరి 26 : పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ట్యాబ్‌లతో పాటు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను అందజేస్తున్నానని, ఫలితంగా మీరందరూ ఉత్తీర్ణత సాధించి తనకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సిద్ధిపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదోతరగతిలో విద్యార్థులకు ఉచితంగా డిజిటల్ కంటెంట్ పుస్తకాలను మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రారంభించుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.



డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

పదోతరతగతి విద్యార్థులకు కేసీఆర్ డిజిటల్ కంటెంట్, టీహెచ్ఆర్ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో మేధస్సుకు పదును పెట్టేలా ఈ పుస్తకం ఎంతో ఉపయోగడపడుతుందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో స్పెషల్ స్టడీ, ఇంట్లో డిజిటల్ స్టడీ ఉంటుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సిద్ధిపేట అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిచిందని, ఇదేస్ఫూర్తితో విద్యారంగంలో కూడా ఆదర్శంగా నిలపాలని సూచించారు. గతేడాది డిజిటల్ కంటెంట్ రూపంలో జిల్లాలోని పదోతరగతి విద్యార్థులకు పంపిణీ చేశామని, ఈ ఏడాది కూడా నియోజకవర్గంలోని పదోతరగతి చదువుతున్న 2,516 మంది విద్యార్థులకు అందజేస్తానన్నారు. ముఖ్యమైన అంశాలపై క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, ఆ క్యూఆర్ కోడ్‌ను, విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్‌లో స్కాన్ చేస్తే వెంటనే ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన అంశంపై ఉపాధ్యాయుడు 3డీ రూపంలో వివరిస్తారని పేర్కొన్నారు. మీరు ఉదయాన్నే 5గంటలకల్లా లేస్తున్నారా లేదా, చదువుతున్నారా లేదా అని, మీ తల్లిదండ్రులతో ఫోన్ చేసి అడుగుతానని హరీశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున్, మధు పాల్గొన్నారు.

జూన్ నుంచి నర్మెటలో ఆయిల్‌పామ్ పంట కొనుగోలు

నంగునూరు: పామాయిల్ రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని జూన్ నుంచి నర్మెటలోనే ఆయిల్‌పామ్ పంటను కొనుగోలు చేసి అశ్వరావుపేటకు పంపిస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.300 కోట్లతో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న 5 నెలల్లో పంట ఉత్పత్తి ప్రా రంభం కానుందని తెలిపారు. పంటను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పండించిన పంటకు సంబంధించిన రవాణా ఖర్చులు, రైతు వ్యవసాయ భూమి నుంచి నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వరకు పామాయిల్ ఫ్యాక్టరీనే చెల్లిస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ఆయిల్ పామ్‌కు మెట్రిక్ టన్నుకు కనీసం రూ.15 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా నాటుకోళ్లతో పెంపకంతో పాటు ఇతర పంటలను వేసుకుని రైతులు ఆదాయం పొందాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు జాప శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్, సర్పంచ్ అజీద్, ఎంపీటీసీ బాబు, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి గీత, ఏఈవో మీరాబాయి, నాయకులు కిష్టారెడ్డి, పురేందర్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

హామీల్లో అబద్ధాలు.. పాలనలో అసహనం

జగదేవ్‌పూర్: ఆరు గ్యారంటీలు కాదు.. అందులోని 13 హామీలను వందరోజుల్లో అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయక్షేత్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరుగ్యారంటీల్లోని 13 హామీలను కూడా వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. తన ప్రాణాన్ని పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్‌పై చిల్లర మాటలు మానుకోవాలన్నారు. లేదంటే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ప్రజలు పాలించిడానికి తెలంగాణ ప్రజలు అవకాశం ఇచ్చారని, వారి బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు తమకు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణవాట కోసం కొట్లాడుతామని ఆయన స్పష్టం చేశారు.

మొగి పురుగు ప్రభావంపై దృష్టి సారించాలి

సిద్ధిపేటఅగ్రికల్చర్ : వరిపై మొగి పురుగు ప్రభావంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యవసాయశాఖ అధికారులను టెలీకాన్ఫరెన్స్ లో ఆదేశించారు. సిద్ధిపేట నియోజకవర్గంలో వరిని సంవత్సరాల తరబడి సాగుచేయడంతో మోగి పురుగు ఉధృతి అధికమవుతుందన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు తెలియజేయాలని ఆయన చెప్పారు.



నంగునూరు : నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కాండం తొలుచు పురుగు

నివారణకు చర్యలు చేపట్టాలి

కొండపాక, జనవరి 26 : ప్రస్తుత యాసంగి వరిసాగులో డిసెంబరు, జనవరి మొదటి వారంలో నాట్లు వేసిన చేలల్లో కాండం తొలుచు పురుగు ప్రభావం విపరీతంగా ఉందని, దాని నివారణ చర్యలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని రైతులకు సూచించారు. దీనికి తోడుగా తేలికపాటి నేలల్లో జింక్ సూక్ష్మదాతు పోషకం లోపాలు కూడా గమనించడం జరుగుతుందని, రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అందుకోసం క్లోరాంత్రినిలిప్రోల్ 60 ఎంఎల్ మందుతో పాటు 200 జెనెట్రాతో కలుపుకుని లేదా 400 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 8 నుంచి 10 పంపులు కలుపుకుని పిచికారి చేసుకోవాలని తెలిపారు. జనవరి రెండోపక్షంలో నాటువేసిన వారు 20 రోజుల అనంతరం క్లోరాంత్రినిలిప్రోల్ 4 కేజీలు లేదా ఫ్లుబెండమైడ్ గుళికలు 4 కేజీలు క్లోరాంత్రినిలిప్రోల్, థాయోమిథాక్సిం 2.5 కేజీలు ఎకరానికి చల్లుకోవాలని తెలిపారు. కలుపు యాజమాన్యం పద్ధతిలో నాటు వేసిన 3 రోజుల వ్యవధిలో ప్రెటిలాక్లోర్ 500 ఎంఎల్ అల్మిక్స్ 8 గ్రాములు ఇసుకలో కలిపి లేదా నాటువేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో బైప్రోమన్, ఎతోక్సీసల్ఫ్యూరాన్ 90 గ్రాములతో పాటు 50 గ్రాముల బిస్పైరిబ్యాక్ సోడియం వంటి కలుపు మందులను పిచికారి చేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలతో

ఆర్థికాభివృద్ధి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 26: ప్రభుత్వం అందించే రాయితీ పథకాలతో రైతులు ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం మండల పరిధిలోని దౌలాపూర్‌కు రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 12 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ జరిగిందన్నారు. వాటికి కావాల్సిన మందులను నేడు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిని శ్వేత, వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు ఐలయ్య, కరుణాకర్, నవీన్ పాల్గొన్నారు.

మాఘమాస జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి26: అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి రామలింగేశ్వరాలయం(కూడవెల్లి) మాఘమాస్య జాతరకు ఏర్పాట్లను పూర్తి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న మాఘమాస్య జాతరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. కూడవెల్లి వాగులో పుణ్యస్నానాలు చేసే భక్తుల కోసం ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చొరవతో కూడవెల్లి జీవనదిగా మారిందన్నారు. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశానని, అలాగే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా ప్రభుత్వానికి లేఖ రాయడంతో ప్రభుత్వం రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌లకు నీళ్లను విడుదల చేసిందన్నారు. మాఘస్నానాలకు ఇబ్బందులు లేకుండా, ఏలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రామేశ్వరంపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రామనాయకులు తదితరులున్నారు.



కూడవెల్లి రామలింగేశ్వరాలయం వద్ద మాఘమాస్య ఏర్పాట్లను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

శామంతల అనిల్‌కు ఇన్నోవేషన్ అవార్డు

మద్దూరు, జనవరి 26 : మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన శామంతల అనిల్ ప్యాడీ స్ప్రింగ్స్ వీడర్ అవిష్కరించినందుకు గానూ ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శామంతల అనిల్‌ను సర్పంచ్ బద్దిపడిగె లలిత ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సన్మానించారు.

ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంది

● సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

కొండపాక, జనవరి 26 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వము తూ.చ. తప్పకుండా అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరు పల్లి లో పలువురు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు అవుతాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందన్నారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై స్టే పొందిన కొమురవెల్లి ఏఈవో వైరాగ్యం అంజయ్య

● ఉత్తర్వులతో మల్లన్న ఆలయానికి రాక
● కుర్చీలో కూర్చోవడంపై అభ్యంతరం
● కమిషనర్ ఆదేశాలు కావాలని నిరాకరించిన ఈవో

చేర్యాల, జనవరి 26 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో డిప్యూటేషన్‌పై ఏఈవోగా పనిచేస్తున్న వైరాగ్యం అంజయ్యపై ఇటీవల పలు ఆరోపణల రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ స్పందించి మెదక్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. దీన్ని సవాల్‌చేస్తూ అంజయ్య హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ఈ మేరకు స్టే ఉత్తర్వులతో శుక్రవారం ఆలయానికి వచ్చి విధుల్లో చేర్చుకోవాలని ఈవో బాలాజీశర్మకు ఉత్తర్వులు అందించి ఏఈవో కుర్చీలో కుర్చున్నాడు. దీంతో తాను రిలీవ్ చేసినందున నేరుగా విధుల్లో చేర్చుకునే అవకాశం లేదని, కోర్టు స్టే ఉత్తర్వులననుసరించి కమిషనర్ కార్యాలయానికి నివేదిక అందిస్తానని, కమిషనర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటానని ఈవో బాలాజీశర్మ తెలిపి, కుర్చీలో కూర్చోకూడదని సూచించడంతో అంజయ్య కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం గమనించిన ఆలయవర్గాలు, స్థానికులు భిన్నరీతిలో స్పందించారు. ఎక్కడికి పంపించినా ఇక్కడే పనిచేయాలని పాకులాడటం ఎందుకుఅని కొందరు, కొన్నినెలలే ఉన్న సర్వీసును కొనసాగిస్తే ఏం అవుతుందని మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయడం చర్చనీయాంశంగా మారింది.



కార్యాలయ కుర్చీలో కూర్చున్న వైరాగ్యం అంజయ్య

ప్రతీ ఆలోచన వెనుక సైన్స్ ఉంటుంది

● సిద్దిపేటలో శాఖాహారుల మెగా ర్యాలీ

సిద్దిపేట టౌన్, జనవరి 26: ప్రతీ ఆలోచన వెనుక సైన్స్ ఉంటుందని, అలాగే శాఖాహారం వెనుక కూడా సైన్స్ దాగి ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక శాతం మాత్రమే శాఖాహారులున్నారని, ఈ సంఖ్య పెరిగేందుకు ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. మంచి ఆరోగ్యానికి, సాత్విక ఆలోచనలకు శాఖాహారం దోహదపడుతుందని వివరించారు. శాఖాహారుల సంఖ్య పెరిగేలా చూడాలని సూచించారు.



శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

అయోధ్య విశిష్ట అతిథి అరవింద్‌కు అభినందనలు

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొని, సిద్దిపేటకు వచ్చిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అరవింద్, శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అయోధ్యలో స్వీకరించిన సీతారాముల ప్రతిమతో పాటు ప్రసాదాన్ని హరీశ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డాక్టర్ అరవింద్‌ను అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నంగునూరు, జనవరి 26: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నంగునూరు పాలమాకుల గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు రమేశ్‌గౌడ్, ఎల్లంకి మైపాల్ రెడ్డి, సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ ఓజాల్, నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తా

● పదో తరగతి విద్యార్థుల చదువుపై హరీశ్‌రావు ఆరా

సిద్దిపేట టౌన్, జనవరి 26: త్వరలోనే సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల తలిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా డిజిటల్ కంటెంట్ పుస్తకాలను హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ విద్యార్థిని అడిగి వారి చదువుకు సంబంధించిన పలు విషయాలపై ఆరా తీశారు.

హరీశ్‌రావు: పొద్దున్నే అమ్మ నిద్ర లేపి చదివిస్తుందా?

విద్యార్థిని: అవును సార్, ఉదయం 5.30 గంటలకు నిద్రలేపి చదువమని చెప్తుంది

హరీశ్‌రావు: నేను పంపిన ఉత్తరం మీ అమ్మ నాన్నలకు అందిందా, టీవీలు బంజేసారా, ఫోన్‌లు చూస్తున్నావా?

విద్యార్థిని: మీరు రాసిన ఉత్తరం అందగానే హరీశన్న లెటర్ రాసి పంపాడు. బాగా చదువుకో అని మా తల్లిదండ్రులు చెప్పారు. పరీక్షలు అయ్యే వరకు టీవీ, ఫోన్‌లు చూడొద్దని చెప్పారు.

హరీశ్‌రావు: కేర్ టీచర్ చదివిస్తున్నారా, అన్నీ చెబుతున్నారా?

విద్యార్థిని: చదివిస్తున్నారు సార్, ఏదైనా డౌట్ ఉంటే కూడా తీరుస్తున్నారు.

హరీశ్‌రావు: నేను మీ అమ్మ నాన్నలకు ఉత్తరం రాసిన. మీకు స్నాక్స్ ఏర్పాటు చేయిస్తున్న. డిజిటల్ కంటెంట్ బుక్స్ ఇస్తున్న. మీ అమ్మనాన్నలతో ఫోన్‌లో మాట్లాడుతా, మరి మీరు అందరు పాస్ కావాలి?

విద్యార్థిని: అలాగే సార్, తప్పకుండా 10 జీపీఏ సాధిస్తాం.

హరీశ్‌రావు: మీరంతా నా పిల్లలుగా నేను ఇంత ప్రయత్నం చేస్తున్నా. మీ భవిష్యత్తు కోసం, మీ తల్లితండ్రులు ఆశయానికి, మీరు చదుకున్న పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆశిస్తున్నా.

విద్యార్థిని: మీరు ప్రోత్సహిస్తున్న తీరు చాలా బాగుంది సార్, మీ కోసం, సిద్దిపేట కోసం, పాఠశాల కోసం తప్పకుండా కృషి చేస్తాం.



పదవతరగతి విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఉత్తమ సేవలకు ప్రశంస

● గణతంత్ర వేడుకల సందర్భంగా అధికారులకు అందజేసిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


వెల్దుర్తి: మెదక్ కలెక్టర్ రాజర్షిషా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఏఎస్‌ఐ వసురాం నాయక్


గణతంత్ర వేడుకల్లో నృత్య ప్రదర్శనలు తిలకిస్తున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, కలెక్టర్, ఎస్పీ, జడ్పీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, జనవరి 26: జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రశంసాపత్రాలను అందజేశారు. సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన 93 మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, జడ్పీ సీఈవో సీహెచ్.ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీఆర్‌వో మెంచు నగేశ్, డీపీఆర్‌వో విజయలక్ష్మి, సివిల్ సప్లయ్ మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, ఆర్డీవోలు పాండు, రవీంద ర్‌రెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, జిల్లా పరిషత్, అటవీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


సంగారెడ్డి టౌన్: గణతంత్ర వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టర్ తేనీటీ విందు

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సంగారెడ్డిలోని కలెక్టర్ వల్లూరు క్రాంతి తన క్యాంపు కార్యాలయంలో తేనీటీ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో మెంచు నగేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ పర్వీన్ షేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

మెదక్ అర్బన్, జనవరి 26: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ఉద్యోగులకు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


మెదక్ అర్బన్: గణతంత్ర వేడుకల సందర్భంగా ఆయా శాఖల్లో ఉత్తమ సేవా అవార్డులు అందుకుంటున్న మెదక్ జిల్లాలోని వివిధ శాఖ ఉద్యోగులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

వెల్దుర్తి, జనవరి 26: వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎ్‌ఐ వసురాం నాయక్, కానిస్టేబుల్ రామయ్య, రిసెప్షన్ అధికారి సుకన్యలు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్‌ఐ వసురాంనాయక్‌కు అతిఉత్క్రిష్ట్, కానిస్టేబుల్ రామయ్యలకు ఉత్క్రిష్ట్ సేవ పతకాలను, మెదక్ జిల్లా ఉత్తమ రిసెప్షన్ సిబ్బందిగా సుక్యనకు శుక్రవారం మెదక్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా అవార్డులను అందజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఆర్సీవోగా భీమయ్య

జోగిపేట, జనవరి 26: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మెదక్ వెస్ట్ రీజియన్ కోఆర్డినేటర్ భీమయ్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఆర్సీవోగా ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో భీమయ్యకు ఉత్తమ ఆర్సీవో అవార్డును అందజేయడంతో పాటు, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా అందోలులోని గురుకుల పాఠశాలతో పాటు, రీజియన్ పరిధిలోని అన్ని సోషల్ వెల్ఫేర్ గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందాలు, భీమయ్యను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, అభినందించారు.


జోగిపేట: రాష్ట్రస్థాయి అవార్డు స్వీకరిస్తున్న భీమయ్య

గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌కు, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్‌కు, వివిధశాఖల అధికారులకు ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి







తూప్రాన్‌లో మున్సిపల్ అవిశ్వాసానికి క్యాంపులు

● రెండు వర్గాలుగా వేర్వేరుగా క్యాంపులకు
● ఒక్కటైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు



తూప్రాన్, జనవరి 26: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమతున్నారు. రాజకీయ పక్షాలు పావులు కదుపుతుండటంతో క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. చైర్మన్ పదవి నుంచి గద్దె దించేందుకు శత్రుపక్షాలు ఒక్కటయ్యాయి. రాజకీయ పార్టీలు ప్రధానం కాకుండా కేవలం చైర్మన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. తూప్రాన్ మున్సిపల్‌లో 16 మంది కౌన్సిలర్లు ఉండగా రెండు వర్గాలుగా విడిపోయి క్యాంపులకు వెళ్లిపోయారు. చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ (రవీందర్‌గౌడ్) ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ అవిశ్వాసం పెడుతున్నట్లు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్‌కు స్వతంత్రులతో కలిసి 13 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇద్దరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. 13 మంది మెజారిటీ ఉండటంతో బీఆర్ఎస్‌కు చెందిన రాఘవేందర్‌గౌడ్ చైర్మన్, నందాల శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్ సహకరించడం లేదంటూ కొంతకాలంగా బీఆర్ఎస్‌కు చెందిన కొందరు కౌన్సిలర్లు దూరంగా ఉంటున్నారు. చైర్మన్ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఓ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఇలా కొనసాగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో అవిశ్వాస వ్యవహారం తెరమీదకు వచ్చింది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రంగంలోకి రావడంతో వ్యవహారం మరింత ముదిరిపోయింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏడుగురు అవిశ్వాసం పెట్టేందుకు సై అనడంతో, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, బీజేపీకి చెందిన ఒక్కరు మద్దతు తెలపడంతో కౌన్సిలర్ల సంఖ్య పదికి చేరింది. దాంతో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు మామిండ్ల జ్యోతి, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతి, జిన్న భగవాన్‌రెడ్డి, రాజు, రవీందర్‌రెడ్డి, లక్ష్మీబాయి, నందాల శ్రీనివాస్, శ్రీశైలంగౌడ్, నారాయణగుప్తా ముందుకు రావడంతో క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టారు. బుధవారం నుంచి క్యాంపు నిర్వహిస్తున్నట్లు సమాచారం. చైర్మన్ రవీందర్‌గౌడ్ సైతం వెంకటేశ్, ఉమాసత్యలింగం, అరుణ వెంకట్‌గౌడ్, తలారి పద్మ, లావణ్య దుర్గారెడ్డితో క్యాంపు నిర్వహిస్తున్నారు. అవిశ్వాసం పెట్టేందుకు 10 మంది కౌన్సిలర్లు ఉండటంతో అవసరమైన మరో కౌన్సిలర్ మద్దతు కోసం ప్రయత్నాలు చేపట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తూప్రాన్ మున్సిపల్‌లో ఒక్కటై అవిశ్వాసం పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నారు. ఒకటి రెండురోజుల్లో అవిశ్వాసం వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. చైర్మన్ నిర్వహిస్తున్న క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లలో ఒకరిద్దరి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నట్లు సమాచారం. కౌన్సిలర్లను కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేసే అవకాశం కనిపిస్తున్నది. ఏదీ ఏమైన తూప్రాన్ మున్సిపల్ రాజకీయ రసవత్తరంగా తయారైందని చెప్పొచ్చు.

కొల్గూరులో మహిళ హత్య

● ఇంట్లోకి చొరబడి నగలను అపహరించుకుపోయిన అగంతకుడు
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ


గజ్వేల్ మండలం కొల్గూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ అనురాధ


శ్యామల(ఫైల్)

గజ్వేల్, జనవరి 26: గజ్వేల్ మండలం కొల్గూరులో మహిళ హత్యకు గురైంది. గ్రామానికి చెందిన చెన్న శ్యామల(55) కిరాణ దుకాణం నిర్వహిస్తూ తన భర్త శ్రీనివాస్‌తో కలిసి జీవిస్తున్నది. శుక్రవారం ఉదయం 5 గంటలకు శ్యామల ఇంటి ఆవరణలోని వాష్‌రూమ్‌కు వెళ్లింది. అది గమనించిన ఆగంతకుడు శ్యామల భర్త శ్రీనివాస్ పడుకున్న బెడ్‌రూంకు గడియ పెట్టాడు. అనంతరం వాష్‌రూమ్ నుంచి శ్యామల బయటకు రాగానే గట్టిగా పట్టుకుని దిండుతో ముఖంపై గట్టిగా ఒత్తడంతో శ్యామల స్పృహ తప్పింది. వెంటనే ఆమె మెడలోని పుస్తెల తాడు, చెవి కమ్మలు తీసుకుని పారిపోయాడు. అనంతరం స్పృహలోకి వచ్చిన శ్యామల నెమ్మదిగా గడియ తీసి జరిగిన ఘటనను భర్తకు చెప్పింది. వెంటనే శ్రీనివాస్ చుట్టుపక్కల వారికి తెలిపాడు. శ్యామలను గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్నదని, వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని అక్కడి వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి వేరే ఆస్పత్రికి తరలించగా అప్పటికే శ్యామల మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శ్యామల హత్య విషయం తెలుసుకున్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా ఘటనా స్థలాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ పరిశీలించారు. అదనపు డీసీపీ అండె శ్రీనివాస్‌రావు, గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్, గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేసి ఛేదించాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ జాన్‌రెడ్డిలకు ఆదేశాలిచ్చారు. గజ్వేల్ మార్చురీలో శ్యామల మృతదేహాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. వారితో గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కొల్గూరు ఎంపీటీసీ జ్యోతిస్వామి ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, జనవరి 26: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్దుర్తి మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానికే వెంకటేశం(45) మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేసేవాడు కాదు. రెండురోజుల క్రితం పనుల నిమిత్తం వెంకటేష్ కుటుంబసభ్యులు ఊరికి వెళ్లారు. కాగా గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో...

ములుగు, జనవరి 26: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బైలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన గువ్వ నరేష్(30) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ వివరించారు.

రేపు కొమురవెల్లి మల్లన్న లష్కర్‌వారం

● నేటి సాయంత్రం కొమురవెల్లికి చేరుకోనున్న సికింద్రాబాద్ భక్తులు


కొమురవెల్లి మల్లన్న

చేర్యాల, జనవరి 26: ప్రముఖ శైవక్షేత్రం కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపటి నుంచి లష్కర్‌వారం ప్రారంభం కానున్నది. సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా, రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా పిలుస్తారు. సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుండటంతో లష్కర్‌వారంగా పిలుస్తుంటారు. శనివారం సాయంత్రానికి ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుని మల్లన్నను ధూళి, దర్శనం చేసుకుంటారు. ఆదివారం మల్లన్నకు పట్నాలు వేసి ఎల్లమ్మతల్లికి బోనాలు నివేదించనున్నారు. ఈ మేరకు ఆలయవర్గాలు, పోలీసులు ఇటీవల ముగిసిన పట్నంవారం ఏర్పాట్లలో నెలకొన్న లోటుపాట్లు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఎండు గంజాయి స్వాధీనం


ఎక్సైజ్ పోలీసుల అదుపులో పాషా

మెదక్ అర్బన్, జనవరి 26: ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన పాషా ఇంటిపై ఈఐ నరేందర్ బృందం ఆధ్వర్యంలో దాడులు చేశారు. కాగా అతని వద్ద నుంచి 150 గ్రాములు ఎండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈఎస్ వెల్లడించారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


కర్మాగారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, తదితరులు

జహీరాబాద్, జనవరి 26: పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని మహీంద్రా కర్మాగారంలో నిర్వహించిన యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. కార్మికుల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నదని చెప్పారు. కార్మికచట్టాలు, లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని, లేనిపక్షంలో ఉత్పత్తులను స్తంభింపజేసి పెద్దఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులు, కార్మికసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు

సంగారెడ్డి రూరల్, జనవరి 26: బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీసాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం కార్మిక, ప్రజాసంఘాల నాయకులు సంగారెడ్డిలోని ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఇప్పటివరకు ప్రజలు, రైతులు, కార్మికులకు ఏమి చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్తం సమ్మెలో అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు జయరాజ్, నర్సింహులు, నాయకులు యాదగిరి, బాబురావు, రాజయ్య, శివశంకర్, కృష్ణ, అశోక్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

● ఘటనా స్థలంలోనే మృతురాలి కుమారుడికి గుండెపోటు
● సీపీఆర్ నిర్వహించి కాపాడిన ఏఎస్ఐ రాజు

హవేళిఘణపూర్, జనవరి 26: జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నది. హవేళిఘణపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన చింతల దుర్గవ్వ(70) వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నది. అయితే గురువారం కుటుంబీకులతో భోజనం చేసి నిద్రించింది. శుక్రవారం ఉదయం లేచిచూడగా దుర్గవ్వ కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామంలోని సర్కారు బావిలో శవమై కనిపించింది. అది చూసిన కొడుకు భైరయ్యకు ఘటనా స్థలంలోనే గుండెపోటు వచ్చింది. పక్కనే ఉన్న హవేళిఘణపూర్ ఏఎస్ఐ రాజు భైరయ్యకు సీపీఆర్ చేయడంతో కోలుకున్నాడు. భైరయ్యను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.


భైరయ్యకు సీపీఆర్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజు



సిద్దిపేట టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



సిద్దిపేట టౌన్: మున్సిపల్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న చైర్ పర్సన్ మంజుల రాజనర్సు



సిద్దిపేట క్రైం: జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి



హుస్నాబాద్ ఐవోసీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో బెన్ షాలోమ్



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కమిషనర్ రాజశేఖర్



హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో జెండాను ఎగుర వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్



అక్కన్నపేట తహసీల్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ సంజీవ్‌కుమార్

వాడవాడలా 'మువ్వన్నెల' రెపరెపలు

75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పంచాయతీ కార్యాలయాలు, వివిధ పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వీట్లను పంపిణీ చేశారు. ఊరూరా ప్రధాన కూడళ్లలో స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అర్బన్/సిద్దిపేట క్రైం, జనవరి 26: 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం సిద్దిపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, ఇర్షాద్ హుస్సేన్, గుండు శ్రీను, లోక లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు. పట్టణంలోని సిద్దిపేట లాల్ కమాన్, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని బీడీ కాలనీ హనుమాన్ విగ్రహం వద్ద బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి దూది శ్రీకాంత్ రెడ్డితో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, విభీషన్ రెడ్డి,గోనె మార్కండేయులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి, బొగ్గులోని బండ, పొన్నాల, మిట్టపల్లి, తడకపల్లి, ఎల్లుపల్లి , గ్రామాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. సిద్దిపేట హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ వారు బూరుగుపల్లిలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. సిద్దిపేట జోనల్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి స్వరూప రాణి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మండలంలో..

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్, జనవరి 26: పట్టణంలోని ఐవోసీలో ఆర్డీవో బెన్ షాలోమ్, బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, పోలీస్ డివిజన్ కార్యాలయంలో ఏసీపీ వాసాల సతీష్, గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజశేఖర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే విద్యా సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో జెండావందనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మార్కెట్ కమిటీ ఎడబోయిన రజిని, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రఘువేందర్‌రెడ్డి, ఎంపీపీ లకావత్ మానస జాతీయ జెండాను ఆవిష్కరించారు. హుస్నాబాద్ మండలం పందిల్లలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు జెండాలను ఎగరవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లకావత్ మానస, వైస్‌ఎంపీపీ దేవసాని నిర్మల, ఎంపీవో , ఎంపీటీసీలు, డీఈలు, ఏఈలు, ఐసీడీఎస్, ఉపాధిహామీ పథకం ఏపీఎం, వెలుగు అధికారులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్ మండలంలో..

గజ్వేల్/గజ్వేల్ రూరల్, జనవరి 26: గజ్వేల్ పట్టణంలోని కోర్టులో న్యాయమూర్తి ప్రియాంక, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, చైర్మన్ రాజమౌళి, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రమేశ్, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఆర్డీవో బన్సీలాల్, ఏఎంసీ, సమీకృత మార్కెట్‌లో కార్యదర్శి జాన్‌వెస్లీ, పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కొమ్ము తిరుపతి, పాక్స్ కార్యాలయంలో చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్ జాతీయ జెండాలను ఎగురవేశారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మోమన్నగారి రాజు, బీజేపీ పట్టణాధ్యక్షుడు మధు, మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, ఎస్‌బీఐ బ్యాంకు వద్ద మేనేజర్ సుజాత జెండాలను ఆవిష్కరించారు. అదేవిధంగా గజ్వేల్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కులసంఘాలు, యువజన సంఘాలు హాస్పిటల్ తదితర కార్యాలయాల ఎదుట జెండాలను ఎగురవేశారు. శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు వివిధ రకాల పప్పు దినుసులతో అరచేతిలో 3 అంగుళాల మువ్వన్నెల జెండానుఆవిష్కరించారు.గజ్వేల్‌లో బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు.

చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో..

చేర్యాల, జనవరి 26 : చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, తహసీల్ కార్యాలయంలో తహసీల్దారు రాజేశ్వర్‌రావు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి పరమేశ్వర్, ఎంఈఐ కార్యాలయంలో ఎంఈఐ కవిత, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్ఆర్ఐ కృష్ణసాయి, చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యనారాయణరెడ్డి, జాతీయపతాకాలను ఎగురవేశారు. అలాగే మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయపతాకాలను ఆవిష్కరించి సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. విజేతలకు బహుమతుల ప్రధానం చేశా రు. కొమురవెల్లి తహసీల్ కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కేవీఎల్ అనూరాధ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నాగరాజు, మల్లన్న ఆలయంలో ఈవో బాలాజీశర్మ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కాగా చేర్యాల పట్టణంలోని అంగడిబజారు ఎస్‌బీఐ బ్రాంచి అధికారులు బ్రాంచి స్థాపించిన నాటి నుంచి గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకలను జరుపుతున్నా, ఈసారి గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించకపోవడంలో బ్యాంకుఅధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టింగ్ చేయడం చర్చనీయాంశమైంది.

దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో..

దుబ్బాక , జనవరి 26: దుబ్బాక పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయనతోపాటు మున్సిపల్‌చైర్ పర్సన్ వనితారెడ్డి, ఎంపీపీ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక పట్టణంలోని ఎంపీపీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌సర్కిల్ కార్యాలయం, ఎస్ఐ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జెండావిష్కరణను ఘనంగా జరిపారు. దుబ్బాక మండల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కార్యాలయాల ముందు కూడా జెండాలను ఎగురవేశారు. మిరుదొడ్డి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ ముందు ఎస్ఐ, మండల విద్యాధికారి కార్యాలయం, ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. మిరుదొడ్డి మండలంలోని అన్ని గ్రామాలతోపాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని గ్రామాలల్లో ఘనంగా వేడుకలను నిర్వహించారు.



గజ్వేల్‌లోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్

రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో

రాయపోల్, జనవరి 26: రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల వద్ద తహసీల్దార్లు దివ్య, సుజాత, ఎంపీడీవో కార్యాలయాల వద్ద మునెయ్య, రాజేశ్‌కుమార్, రాయపోల్, దౌల్తాబాద్, బేగంపేట పోలీస్ స్టేషన్‌ల వద్ద రఘుపతి, చైతన్య కుమార్ రెడ్డి, అరుణ్, ఏఎంసీ వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి జాతీయ జెండాలను ఎగురవేశారు. వారితో ఎంపీపీలు అనిత, సంధ్య, జడ్పీటీసీలు యాదగిరి, జ్యోతి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీం, మండల కోఆప్షన్ సభ్యులు పర్వేజ్, అహ్మద్ ఉన్నారు.

వివిధ మండలాల్లో

నంగునూరు, జనవరి 26: నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. నంగునూరులో మండల పరిషత్ కార్యాలయం ముందు ఎంపీడీవో వేణుగోపాల్, రెవెన్యూ కార్యాలయం ఎదుట తహసిల్దార్ అనిల్ కుమార్, రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ ముందు ఎస్ఐ మోహన్ రెడ్డి, సహకార సంఘం ఎదుట చైర్మన్ కూలర్ రమేష్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహం వద్ద పంచాయతీ సెక్రెటరీ చంద్రకళ, గాంధీ విగ్రహం వద్ద ఎంపిటిసి కోల సునీత మహేందర్ గౌడ్ లు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామస్వామి గౌడ్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డాక్టర్ రాకేశ్, ఎమ్మార్సీఎదుట ఎంఈవో దేశిరెడ్డి, గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ ఉమాపతి, ఆటో యూనియన్ వద్ద ఎస్ఐ మోహన్ రెడ్డి, ఐకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం ఆంజనేయులు, మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ముందు పంచాయతీ కార్యదర్శులు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, యువజన, కులసంఘాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి, జెండాకు గౌరవ వందనం చేశారు.

● **నారాయణరావుపేట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, వ్యవసాయ కార్యాలయంలో ఏవో వెంకట రమణి, విద్యుత్ కార్యాలయంలో ఏఈ తిరుపతి, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ధర్మసాగర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ రామా అఖిలేష్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, సిద్దిపేట రూరల్ పోలీస్ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

● **తొగుట:** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయితీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. తొగుట తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీధర్, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో యాదవరెడ్డి, తొగుట పోలీసు స్టేషన్‌లో సీఐ కమలాకర్, మార్కెట్ కమిటీ కార్యాలయం, కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, ఐకేపీ కార్యాలయం వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లత నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దుబ్బాకలో జాతీయజెండా ఎగరేసి, అభివాదం చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

● **ములుగు:** మండలంలో తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ప్రవీణ్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ములుగు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్, స్థానిక గ్రామ పంచాయతీ వద్ద సర్పంచు బట్టు మాధవి అంజిరెడ్డి, కో ఆపరేటీవ్ బ్యాంకు వద్ద చైర్మన్ బట్టు అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంవద్ద మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి జెండావిష్కరణలు చేశారు.

● **కోహెడ:** మండలవ్యాప్తంగా గ్రామాల్లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నారు. మండల కేంద్రంలోని వీధుల్లో ప్రభాత భేరి ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సురేఖ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో బోగశ్వర్, గ్రామపంచాయతీలో సర్పంచ్ పేర్యాల నవ్య పీఏసీఎస్‌లో చైర్మన్ పేర్యాల దేవందర్‌రావు, పీహెచ్‌సీలో వైద్యాధికారి నమ్రా జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కొక్కుల కీర్తి, వైస్ ఎంపీపీ తడుకల రాజిరెడ్డి ఎంపీటీసీలు జాగిరి కుమారస్వామి, కోనే శేఖర్, ఖమ్మం స్వరూప వెంకటేశం, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **మద్దూరు:** మద్దూరు ఉమ్మడి మండలంలోని శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకల్ని మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఏవో రామకృష్ణ, వైద్యాధికారి రజిత, ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ, దూళిమిట్ట తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ దబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, ఉమ్మడి మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, చొప్పరి వరలక్ష్మిసాగర్, స్థానిక సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఏపీఎం బాబూరావు, రేబర్తిలో ఉపసర్పంచ్ డాకూరి లక్ష్మి జాతీయపతాకాన్ని ఎగురవేశారు.

● **అక్కన్నపేట:** అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొప్పుల సత్యపాల్ రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తాండ్ర వివేక్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గొల్లపల్లి వీరాచారి, పలు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేశారు.



మద్దూరు ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో





చేర్యాల తహసీల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న తహసీల్దారు రాజేశ్వర్‌రావు, కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో ఈవో బాలాజీ శర్మ



నంగునూరు ఎంపీపీ కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వేణుగోపాల్



మిరుదొడ్డి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో



చిన్నకోడూరులో భారతమాత, గాంధీ, అంబేడ్కర్, నెహ్రూ వేషధారణలో చిన్నారులు



నారాయణరావుపేట: తహసీల్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ లక్ష్మారెడ్డి



తొగుట: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఎంపీడీవో శ్రీధర్, పాల్గొన్న ఎంపీపీ లత



ములుగు తహసీల్దారు కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు



కోహెడ: తహసీల్ కార్యాలయంలో జెండాను ఎగురవేసిన తహసీల్దార్ సురేఖ

రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలి



వాహనచోదకులకు గులాబీపువ్వు అందిస్తున్న చేర్యాల ఎస్ఐ దామోదర్

చేర్యాల, జనవరి 26: రోడ్డు భద్రతను పాటించి ప్రమాదాల నివారణకు పాటుపడాలని చేర్యాల ఎస్ఐ దామోదర్ పేర్కొన్నారు. రోడ్డుభద్రతమాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చేర్యాల పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులకు గులాబీపువ్వు అందించి పలు సూచనలు చేశారు.

ఐక్యతకు మారుపేరుగా జర్నలిస్టు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో గెలుపొందిన జర్నలిస్టులకు బహుమతి ప్రదానం

సిద్దిపేట అర్బన్, జనవరి 26: సిద్దిపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సిద్దిపేట వర్కింగ్ జర్నలిస్టుల క్రీడా పోటీలు ఐక్యతకు మారుపేరుగా నిలిచాయని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగాచారి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులుగా కొనసాగిన జర్నలిస్టుల క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. క్రికెట్ ఫైనల్ పోటీలో విజయం సాధించిన లెవన్ టైగర్స్, రన్నర్‌గా నిలిచిన వీజే కింగ్స్ జట్లకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం టగ్ ఆఫ్ వార్‌లో విజయం సాధించిన ట్రిపుల్ ఎస్ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన రాయల్ జట్టుకు బహుమతులను అందజేశారు. క్యారం డబుల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన స్వామి, శ్రీకాంత్‌లకు, ద్వితీయ స్థానంలో నిలిచిన రంగధాంపల్లి శ్రీనివాస్ కరుణాకర్‌రెడ్డి లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రంగాచారి తో పాటు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం క్రికెట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్న కరుణాకర్ రెడ్డి, శ్రీకాంత్, రాజు, స్వామి, ప్రవీణ్‌లకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకున్న కరుణాకర్‌రెడ్డికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రీడా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, రంగధాంపల్లి శ్రీనివాస్, సతీష్, రాజు, మల్లారెడ్డి, నరేష్, సీనియర్ జర్నలిస్టులు కూతురు రాజిరెడ్డి, కత్తుల శ్రీనివాస్, రఘు, మజ్జు, పాండు, అయిత శ్రీనివాస్, రాజు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన టీజేఎస్ నాయకులు



కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ నాయకులు

గజ్వేల్, జనవరి 26: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను సిద్దిపేట జిల్లా టీజేఎస్ కన్వీనర్ నిరుడి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట టీజేఎస్ కోకన్వీనర్ అందే ప్రవీణ్, సిద్దిపేట జిల్లా యూత్ కన్వీనర్ కీసర స్వామి, ప్రశాంత్ ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, జనవరి 26: గత ప్రభుత్వం పై విమర్శలు మానుకుని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. యాసంగి పంటకు నీరు అందక ఆందోళన చెందుతున్న రైతుల బాధను మాజీమంత్రి హరీశ్‌రావు ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి స్వయంగా కలిసి లేఖ ఇచ్చి, మరోసారి ఫోన్‌లో వివరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులోకి పంపింగ్ చేసిన నీటిని ప్రాజెక్టు కాలువల ద్వారా వదిలి, లక్షా 10 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పడం హర్షణీయమన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాపయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ వనిత, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీలు శ్రీనివాస్, శారద, మండల కో ఆప్షన్ మెంబర్ సాదక్, నాయకులు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

చేర్యాల, జనవరి 26: మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన వల్లంపల్లి సాయిలుకి చెందిన పాడిగేదె శుక్రవారం వ్యవసాయబావి వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మొక్కల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

చేర్యాల, జనవరి 26: మండలంలోని కాశీగుడిశెలు గ్రామ వననర్సరీలో మొక్కలు ధ్వంసం చేసి ఆ భూమిని ఆక్రమించిన ఆకునూరు గ్రామానికి చెందిన బుడిగ జంగాల కాలనీవాసులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతి శుక్రవారం చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పేర్కొన్న వివరాల మేరకు.. ఆకునూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.740/ఎ/2లో 30గుంటల భూమిని 2020లో ప్రభుత్వం కాశీగుడిశెలు గ్రామ పల్లెప్రకృతివనానికి కేటాయించడంతో మొక్కలపెంపకం చేపట్టారు. కొంతకాలంగా పలువురు బుడిగజంగాల కాలనీవాసులు మొక్కలని ధ్వంసం చేస్తుండటంతో గతంలో పోలీసులు, అధికారులు మందలించినా వారు తీరు మార్చుకోలేదు. గురువారం 800మొక్కలను తొలగించి అక్కడ తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. తద్వారా రూ.2.లక్షలమేర గ్రామపంచాయతీకి నష్టం కలిగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు

బట్టల వర్తక సంఘం కార్యవర్గం ఎన్నిక



పట్టణ బట్టల వర్తక సంఘ కార్యవర్గం

హుస్నాబాద్, జనవరి 26: హుస్నాబాద్ పట్టణ బట్టల వర్తక సంఘ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెల్దండి శివరాజం, అధ్యక్షుడిగా బూర్ల రాజయ్య, ఉపాధ్యక్షులుగా వెనిశెట్టి వెంకటేశ్వర్లు, వెల్దండి చంద్రమౌళి, కార్యదర్శిగా దూలం సంపత్, సహాయ కార్యదర్శిగా బత్తుల శ్రీనివాస్, కోశాధికారిగా వెల్దండి నాగభూషణం, కార్యవర్గ సభ్యులుగా సాదుల యాదగిరి, వేముల రాజేశం,చిదురాల రమేశ్, నన్నె శ్రీను, బూర్ల అశోక్, కూరపాటి రాజన్న, బండి భరత్, గజవెల్లి రాజ్‌కుమార్, వెల్దండి శ్రీనివాస్, చేర్యాల సంతోష్, అమినిశెట్టి సుభాష్‌లను ఎన్నుకున్నారు.